

రహదారులకు మోక్షం

నర్సీపట్నం నియోజకవర్గంలో శరవేగంగా మరమ్మతు, అభివృద్ధి పనులు

- రెండు విడతల్లో రూ.40 కోట్లు మంజూరు చేయించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- 587 సీసీ రోడ్లు, పది బీటీ రహదారులు
- ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాలని అధికారుల లక్ష్యం
- ప్రజలకు తీరనున్న కష్టాలు



నాతవరం మండలం తాళ్లపాలెం- వడపర్తి మధ్య నూతనంగా నిర్మించిన తారు రోడ్డు

నర్సీపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అయిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాల్లో రూ.40 కోట్ల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, తారు రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులు ఎంత అధ్వానంగా వున్నాయో అందరికీ తెలిసిందే. రోడ్లను అభివృద్ధి చేయడం మాట అటుంచి.. కనీసం గోతులను కూడా పూడ్చ లేదు. వర్షం కురిస్తే ఇబ్బందులు వర్ణనాతీతం. గోతుల్లో నీరు చేరి పంట కుంటలను తలపించేవి. వాహనాలు పాడైపోవడమే కాకుండా ప్రయాణించడానికి అధిక సమయం పట్టేది. మరోవైపు రహదారులకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి కూటమి ప్రభుత్వం, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారుల్లో గోతుల పూడ్చివేత పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఇక పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అంతర్గ రోడ్లను ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లుగా మార్చేస్తున్నారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరునాటికి పూర్తిచేసి ఉగాది రోజున ప్రారంభోత్సవాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

తొలివిడత రూ.35 కోట్లతో 521 రోడ్లు అభివృద్ధి

నర్సీపట్నం నియోజకవర్గంలో 521 రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసింది. వీటిలో 512 సీసీ రోడ్లు, 9 బీటీ రోడ్లు ఉన్నాయి. 369 సీసీ రోడ్లు, ఆరు బీటీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో వున్నాయి. అన్నింటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయడానికి పీఆర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదిలావుండగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ నెల 10వ తేదీన మరో రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఒక బీటీ రోడ్డు, 75 సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కొంతమేర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈఈ ఈశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ఈ నెలాఖరుకి బిల్లులు మొత్తం మంజూరు అవుతాయని తెలిపారు. బిల్లుల కారణంతో ఎక్కడా పనులు ఆగలేదని ఆయన స్పష్టం చేశారు.



గతంలో ఉన్న మట్టి రోడ్డు





లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల కెప్టెన్లు రిషబ్ పంత్, అక్షర్ పటేల్

నేడే ఐపీఎల్ సమరం

సర్వాంగ సుందరంగా ముస్తాబైన స్టేడియం

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య సోమవారం సాయంత్రం జరగనున్న ఐపీఎల్ టీ-20 మ్యాచ్‌కు సర్వం సిద్ధమైంది. నిర్వాహకులు ఇప్పటికే స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సీజన్‌లో రెండు జట్లకు ఇదే తొలి మ్యాచ్. ఇక్కడి స్టేడియాన్ని రెండు మ్యాచ్‌లకు హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయం సాధించాలనే సంకల్పంతో సిద్ధమవుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా రిషబ్ పంత్, అక్షర్‌పటేల్

సోమవారం జరగనున్న మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రిషబ్ పంత్, ఢిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర పటేల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో అక్షర పటేల్, కేఎల్ రాహుల్, కులదీప్ యాదవ్, మిచెల్ స్టార్క్, డూప్లెసిస్ మినహా మిగిలినవారిలో స్టార్ ఆటగాళ్లు తక్కువ. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌లో రిషబ్ పంత్, మిచెల్ మార్ష్, డేవిడ్ మిల్లర్ వంటి సీనియర్ క్రికెటర్లున్నారు. ఇరుజట్ల ఆటగాళ్లు ఆదివారం ముమ్మర సాధన చేశారు. అన్ని ప్రవేశ ద్వారాల వద్ద వైఫైతో కూడిన స్కానర్ బోర్డులను ఏర్పాటు చేశారు. వీక్షకులు టికెట్‌పై ఉన్న బార్ కోడ్ ను స్కాన్ చేసి లోపలికి ప్రవేశించాలి. ప్రారంభానికి రెండు గంటల ముందుగానే క్రీడాభిమానులను అనుమతించనున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి కెమెరాలు, మ్యాచ్

... మిగతా 6వ పేజీలో

జడ్పీ కోఆప్షన్ సభ్యునిపై ఎమ్మెల్యే ఫైర్

- మండల సమావేశంలో అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణపై సుందరపు ప్రసంగం
- మధ్యలో అడ్డుపడిన నర్మాల కుమార్
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే
- అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని సలహా
- అయినా ఆగని జడ్పీ కోఆప్షన్ సభ్యుడు
- సమావేశం నుంచి బయటకు వెళ్లాలని ఎమ్మెల్యే హుకుం



జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్‌పై (కుడి వైపున వున్న వ్యక్తి) ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్‌పై పలుమార్లు తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ ఎప్పుడో పూర్తి కావాల్సిందని, కానీ జాప్యం కారణంగా భూ నిర్వాసితులకు ఇచ్చే నష్టపరిహారం రూ.200 కోట్లకు పెరిగిందని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిర్వాసితులను టీడీఆర్‌లకు ఒప్పించామని అన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు, ఇతర విషయాల గురించి ఆయన మాట్లాడుతుండగా.. జడ్పీ కోఆప్షన్ సభ్యుడు (వైసీపీ) నర్మాల కుమార్ అడ్డుతగిలి.. రోడ్డు విస్తరణలో నిర్వాసితులకు టీడీఆర్‌లు ఇస్తామని చెబుతున్నారని, టీడీఆర్‌ల గురించి నిర్వాసితులకు వివరించాలని అన్నారు. దీంతో ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యేగా తాను ఒక అంశంపై మాట్లాడుతున్నప్పుడు, అది పూర్తికాకుండానే మధ్యలో అవాంతరం కలిగిస్తే ఎలా? తాను మాట్లాడడం పూర్తయిన తర్వాత సందేహాలను వ్యక్తం చేయాలని సూచించారు. నర్మాల కుమార్ మళ్లీ ఏదో చెప్పబోగా.. ఎమ్మెల్యే తీవ్రంగా స్పదించారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలు వద్దని సున్నితంగా

... మిగతా 6వ పేజీలో

నూకాంబిక ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా నియామకమైన ఉత్సవ కమిటీ ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ ఛైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ధర్మకర్తలుగా సూరే సతీశ్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు లక్ష్మిలతో ఆలయ ఈవో వెంపలి రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నేత బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, ఉత్సవ కమిటీ ప్రత్యేక అధికారి శోభారాణి కూటమి నాయకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, దూలం గోపి, కాండ్రేగుల సత్యనారాయణ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, భీమరశెట్టి చిన్ని, మాదంశెట్టి నీలబాబు, విజయ్‌నాయుడు, బీఎస్ఎంకే జోగినాయుడు, సబ్బవరపు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవ కమిటీ

రెవెన్యూ ఉద్యోగులపై దాడి ఘటనలో నలుగురిపై కేసు

సబ్బవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.సింహాచలం తెలిపారు. వీఆర్వోలు వినోద్, నూకరత్నం, వీఆర్ఏ ముదపాక అప్పారావు, ఆర్ఐ వీరయ్యలు శుక్రవారం మధ్యాహ్నం సబ్బవరం సర్వే నంబరు 271లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించడానికి వెళ్లారని చెప్పారు. ఈ సందర్భంగా రావలమ్మపాలేనికి చెందిన గొంప ముత్యాలనాయుడు, గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి కుమారస్వామి, లగుడు సత్యనారాయణ, పెదనాయుడుపాలేనికి చెందిన గొర్లి శ్రీనివాసరావు.. ఆయా రెవెన్యూ ఉద్యోగులను అడ్డుకుని, దుర్భాషలాడి, రాళ్లతో దాడి చేసి, కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పై నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కొండకర్ల ఆవలో నిలువు దోపిడీ!

పర్యాటకుల నుంచి ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు

- చేపల వేట సాగించాల్సిన బోట్లతో ఆవలో విహారం
- ఒక్క బోటులో కూడా కానరాని లైఫ్ జాకెట్లు
- ఫొటో షూట్‌లు, షార్ట్ ఫిల్మ్‌లు తీసినా.. డబ్బులు ఇవ్వాల్సిందే
- ఆవను రూ.కోటితో అభివృద్ధి చేసిన పంచాయతీ
- ఆదాయంలో ఒక్క రూపాయి కూడా దక్కని వైనం



చేపల వేట సాగించే ఈ బోట్లలోనే పర్యాటకులను ఆవలో విహారానికి తీసుకెళుతున్నారు.

అచ్యుతాపురం రూరల్, మార్చి 23, (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం, మునగపాక మండలాల సరిహద్దులో వున్న ప్రముఖ పర్యాటక ప్రదేశం కొండకర్ల ఆవలో సందర్శకులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. సొమ్మొకరిది.. సోకు మరొకరిది అన్న చందంగా గ్రామ పంచాయతీ నిధులతో ఆవ వద్ద అభివృద్ధి పనులు చేయగా, పర్యాటకుల నుంచి టికెట్ రూపంలో వసూలు చేసే ఆదాయంలో ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెందడంలేదు. ఇక్కడ ఫైబర్ బోట్ల నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి, పర్యాటకులకు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సుగా కొండకర్ల ఆవ పేరు పొందింది. కొండకర్ల, అందలాపల్లి, వాడ్రాపల్లి గ్రామాలకు చెందిన రెండు కులాల వారు అనాదిగా కాలంగా ఈ ఆవలో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ ప్రాంతం పర్యాటకును ఆకర్షిస్తుండడంతో రెండు, మూడు దశాబ్దాల నుంచి సందర్శకుల రాక బాగా పెరిగింది. దీంతో చేపల వేటతో పాటు ఆవలో తాటిదోనెలపై పర్యాటకులను ఆవలో తిప్పుతూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఇటీవల కాలంలో పర్యాటకుల రాక మరింత అధికంగా వుండడం, తాటి దోనెలపై ఆవలో విహరించడం ప్రమాదకరంగా వుండడంతో వాటి స్థానంలో ఫైబర్ బోట్లు అందుబాటులోకి

... మిగతా 6వ పేజీలో



పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.13 (సోమవారం సాయంత్రం)

సహర్ : 4.42 (మంగళవారం ఉదయం)



జడ్పీ కోఆప్షన్ సభ్యునిపై ఎమ్మెల్యే ఫైర్

... 5వ పేజీ తరువాయి

మందలించారు. అయినాసరే నర్మాల కుమార్ మాట్లాడడం ఆపకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. "మధ్యలో మాట్లాడొద్దన్నానా! అసలు నువ్వు మాట్లాడొద్దు. ఎప్పుడు ఎలా మాట్లాడాలో నీకు తెలియదు. కామన్‌సెన్స్ లేకపోతే ఎలా? జడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేదికపై కోర్చేవచ్చని ప్రొటోకాల్‌లో వుందా? ముందు నువ్వు బయటకు వెళ్లు" అని కోపంగా అన్నారు. అయినా సరే నర్మాల కుమార్ ఇంకా ఏదో చెప్పబోతుండగా... ఇలాగైతే తానే బయటకు వెళ్లిపోతానంటూ ఎమ్మెల్యే విజయకుమార్ కుర్చీలో నుంచి లేచారు. దీంతో వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి.. జడ్పీ కోఆప్షన్ సభ్యుడిని మందలించారు. ఇటువంటి తరుణంలో నర్మాల కుమార్ ఏదో అనబోతుండగా.. 'నసగవద్దు. ముందు బయటకు వెళ్లు' అని ఎమ్మెల్యే గట్టిగా హెచ్చరించారు. మీరు కాదు అధికారులు చెప్పాలని కుమార్ అంటుండగా.. వారు చెప్పరు తానే చెబుతున్నానని, బయటకు వెళ్లు అని గద్దించడంతో కుమార్ సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు.

కొండకర్ల ఆవలో నిలువు దోపిడీ!

... 5వ పేజీ తరువాయి

తేచ్చారు. అయితే చేపల వేట సాగించే ఫైబర్ బోట్లలో పర్యాటకులను ఎక్కించుకుని ఆవలో సందర్శించే వారితోపాటు ఆవ వద్ద ఫొటో షూట్‌లకు వచ్చే వారి నుంచి, షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించే వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. పర్యాటకుల నుంచి నిర్ణీత మొత్తంలో చార్జీలు వసూలు చేయాలన్న నిబంధనలు ఏవీ లేకపోవడంతో బోట్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఒక్క బోటులో కూడా లైఫ్ జాకెట్లు లేవు. కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ నిధులు సుమారు రూ.60 లక్షలతో మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు మేర సిమెంటు రోడ్డు వేయించారు. సీఎస్ఆర్ నిధులతో సోలార్ వీధి దీపాలు, టాయిలెట్లు, ఒక షెడ్డు, శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేశారు. రూ.20 లక్షలతో పిల్లల పార్కు, కార్ పార్కింగ్‌లను అభివృద్ధి చేశారు. మొత్తం మీద కోటి రూపాయలకుపైగా ఖర్చుచేశారు. కానీ పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెందడంలేదు.

వేంపాడులో ప్రారంభమైన నూకాలమ్మ సంబరాలు


వేంపాడులో బోనాల ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో నూకాలమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా జరుగుతున్నాయి. సాయంత్రం మహిళలు బోనాలు, కలశలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈనెల 28న కొత్తమావాస్య జాతర జరుగుతుంది.





నేడే ఐపీఎల్ సమరం

... 5వ పేజీ తరువాయి

బాక్సులు, లైటర్లు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, మండే స్వభావం గల వస్తువులు, పొగాకు ఉత్పత్తులు, టిఫిన్లు, పదునుగా ఉన్న వస్తువులు, తినుబండారాలు, గొడుగులు, క్రాకర్స్ జంతువులు, రేడియో, ఆల్కహాల్, కర్రలు, లేజర్‌లైట్లు, బెలూన్లు, గ్లాస్‌బాటిళ్లు, పెర్ఫ్యూమ్స్ స్ప్రే బాటిళ్లు, సిరంజిలు, విజిల్స్, హారన్స్, స్పోర్టింగ్ బాల్స్, రోలర్ స్కేటర్లు, ప్రమోషనల్ ప్రొడక్ట్స్, ల్యాప్‌ట్యాప్‌లు, పెన్నులు, పెన్సిళ్లు తీసుకురాకూడదు.





















అనకాపల్లి జోన్ వార్తలు I II పేజీల్లో

నేడు అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

పాడేరురూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 24వ తేదీ సోమవారం పాడేరు లోచలిపుట్టులోని గిరిజన విద్యార్థి భవన్‌లో నిర్వహించనున్నట్టు ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టపులి శ్రీనివానివాస్ పడాల్, రాష్ట్ర ఆర్గనైజర్ సోమెలి సింహాచలం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గంఎన్నికలు, ఇటీవల ఆదివాసీ చట్టాలపై జరుగుతున్న దాడులు, 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ అమలుపై ముఖ్యమంత్రి, ఇతర అధికారులను కలవటం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. స్పెషల్ డీఎస్సీ ద్వారా శత శాతం స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలని, ఇటీవల గ్రూప్ 1, 2ల నియామకాలలో రోస్టర్ ప్రకటనపై ప్రభుత్వంపై ఒత్తిడి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదోన్నతుల్లో జరిగిన అవకతవకలపై చర్చించి ప్రణాళిక రూపొందించనున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల సభ్యులు, క్రియాశీల సభ్యులు, జిల్లా, రాష్ట్ర శాఖ బాధ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

జి.మాడుగులలో దొంగల హల్‌చల్


చోరీకి యత్నించిన ఆలయ హుండీ

జి.మాడుగుల, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకుంటుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో గ్రామంలో ఆటో వాహనం బ్యాటరీ గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. తాజాగా స్థానిక మత్స్యమాడుగులమ్మ ఆలయంలోని శనివారం రాత్రి హుండీ ని పగలకొట్టి అందులోని నగదును దోచుకోవడానికి యత్నించారు. అయితే, అవి హుండీ తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి జారుకున్నారు. ఆదివారం ఉదయం పూజారి గుడి తలుపులు తీయడంతో విషయం గుర్తించారు. మండల కేంద్రంలో పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ఆనంద్

గూడెంకొత్తవీధి/సీలేరు, మార్చి 23 , (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాన్ని చెల్లించాలని జీకేవీధి మండలం వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎంపీటీసీ సభ్యులకు కేటాయించిన గౌరవ వేతనం నేటికి 27 నెలలు చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలకు నిధులు కేటాయించి వర్క్ ఆర్డర్లు కూడా ఇచ్చారని, దీనికి సంబంధించిచాలా వరకు పనులు పూర్తి చేసినా ఆ నిధులు కూడా మూడు నెలలు గడుస్తున్నా విడుదల కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేవారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎంపీటీసీల గౌరవ వేతనం, ఇతర నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

వ్యాన్ బోల్తా: మహిళ మృతి


వ్యాన్ కింద పడి మృతి చెందిన గిరిజన మహిళ

ముంచంగిపుట్టు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగబయలు పంచాయతీ కోసంపుట్టు గ్రామ సమీంలో ఘాట్ మార్గంలో పనసకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఒడిశా రాష్ట్ర కోరాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ తుభ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కిల్లో కుమ్మి(42) మృతి చెందింది. వివరాలివి.. ఒడిశాకు చెందిన వ్యాపారులు వ్యాన్‌లో ఆదివారం రంగబయలు పంచాయతీ కోసంపుట్టు , పట్నాపడాల్‌పుట్టు, జోడిగుమ్మ గ్రామాలకు పనసకాయలు కొనుగోలుకు వెళ్లి, తిరిగి లోడ్ చేసుకొని వస్తుండగా కొసంపుట్టు ఘాట్‌లో వ్యాన్ బ్రేక్ ఫెయిల్ అయింది. ఈ సమయంలో ఈ వాహనం వెనుకున్న కుమ్మి కింద పడిపోగా, ఆమె పైనుంచి వ్యాన్ బోల్తా పడింది. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. వాహన డ్రైవర్, పనసకాయల కొనుగోలుదారుడు అక్కడ నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు.

నత్తనడకన బస్కీ రోడ్డు పనులు

» ఆరునెలల కిందట రూ. 3.30 కోట్లు మంజూరు » నేటికీ పూర్తికాని నిర్మాణం » రహదారిపై కంకరు, మెటల్‌తో ఇక్కట్లు


నిర్మాణం పూర్తి చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫొటో)


అరకులోయ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ ప్రాంత రహదారుల్లో అరకులోయ -బస్కీ రోడ్డుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ మార్గంలో పెదలబుడు మొదలు చొంపి, మాడగడ, బస్కీ, అనంతగిరి,హుక్కుంపేట మండలాల్లోని శివారునున్న వెంగడ, పైనంపాడు, మట్టం, బూర్జ తదితర పంచాయతీల్లోని సుమారు 100 నుంచి 130 గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే, అరకులోయ నుంచి చొంపిమీదుగా చంపగుడ, పకనగుడ మీదుగా మాడగడసన్‌రైజ్ పాయింట్‌కు ఇలానే వెళ్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అరకులోయ వయా చొంపి బస్కీ వరకు ఉన్న 18 కిలోమీటర్ల గల ఈ రహదారి మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఆరునెలల క్రితం పీఆర్ (ప్రాజెక్టు) వారి పర్యవేక్షణలో రూ. 3.30 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో ఈ రహదారి శిథిలావస్థకు చేరింది. ఇక సీసీ ర్యాంపులు మట్టి రోడ్లకన్నా దారుణంగా తయారయ్యాయి. ఈస్థితిలో ఎట్టకేలకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంతో గిరిజనం సంబరపడ్డారు. అయితే, పనులు నత్తనడక సాగుతున్నాయి. సుంకరమెట్ట-వర్రా రహదారిలో భాగంగా చొంపి- ఎం.హట్టగుడ మధ్యన బస్కీ రహదారి ప్రారంభమవుతోంది.

రహదారి సత్వరం పూర్తిచేయాలి



చాలా ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన అరకులోయ-బస్కీ రహదారికి కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసినా, అనుకున్నంత స్థాయిలో పనులు జరగడం లేదు. ప్రస్తుతం రాకపోకలు వీలుకాని పరిస్థితిని సంబంధిత కాంట్రాక్టర్ తీసుకువచ్చారు. కంకరు పోసి రోలింగ్ చేయకుండా వదిలేశారు. పాదచారులతో పాటు ఆటోలు, బైక్‌లకు ఇబ్బందిగా మారింది.

- కిండంగి రామారావు, సీపీఎం మండల కార్యదర్శి


రహదారిపై వదిలేసిన కంకర

రోడ్డు మధ్య మెటల్‌తో నరకం

ఆ జంక్షన్ నుంచి 40 ఎంఎం మెటల్‌ను రహదారంతా పరిచి రోలింగ్ చేయకుండా గత ఆరు నెలలు వదిలేయడంతో వాహన చోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. కంకరుపై వెట్‌మిక్స్‌వేసి రోలింగ్ పనులు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆదివాసీ, గిరిజన సంఘం, సీపీఎం నాయకులు ఈ రహదారిపై గతంలో నిరసన వ్యక్తం చేశారు. అయినా, అధికారులు పట్టించుకోలేదు. ఇకనైనా పంచా యతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి ప నులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, టీడీపీ నేతలు అప్పలరాజు, మాణిక్యం, బలరాంలు డిమాండ్ చేస్తున్నారు.

శ్మశాన వాటికలో సీసీ రోడ్ల నిర్మాణం


భూమి పూజలో ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ, సర్పంచి

చింతపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్మశానవాటికలో రూ. 20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ నిధులతో అంతర్గత సీసీరోడ్లు నిర్మిస్తున్నట్టు మేజర్ పంచాయతీ సర్పంచి దురియా పుష్పలత తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లతోపాటు రచ్చబండ, పోస్టుమార్టం షెడ్ నిర్మాణంతోపాటు తాగు నీటి సదుపాయం కల్పిస్తామన్నారు. జడ్పీ నిధులతో బోరు నిర్మాణానికి, మండల పరిషత్ నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు ఎంపీపీ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రజలు పోరాటాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతిని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ నేతల్లో అగ్రశ్రేణికి చెందిన వారిలో భగత్ సింగ్ ఒకరు అన్నారు. సాయుధ పోరాటంలో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లుప్రత్యేకతను సొంతం చేసుకున్నారన్నారు. వీరి స్ఫూర్తితో యువ త దేశ పరిరక్షణకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, దాస్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ ఆధ్వర్యంలోభగత్ సింగ్ 94వ వర్ధంతి చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.కృష్ణ, జగదీశ్, ఇందు, అనూష, నయోమి, ఎల్లిషా, గౌరీ, హేమ పాల్గొన్నారు.

లంబసింగి హరిత రిసార్ట్స్‌లో మెరుగైన సదుపాయాలు

» ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి



లంబసింగి జంక్షన్‌లో రిసార్ట్స్ సూచికను ఏర్పాటులో పద్మావతి

చింతపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి సందర్శించే పర్యాటకులకు హరిత రిసార్ట్స్‌లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఏటీడీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) పద్మావతి అన్నారు. ఆదివారం లంబసింగి హరిత రిసార్ట్స్‌ని సందర్శించిన ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. మధ్యాహ్నం నర్సీపట్నం-లంబసింగి, పాడేరు-చింతపల్లి మార్గంలో హరిత రిసార్ట్స్ సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లంబసింగిలో గతంతో పోల్చుకుంటే పర్యాట కులకు మం చి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రస్తుతం వేసవిలోనూ పర్యాటకులు లంబసింగిని సందర్శిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో హరిత రిసార్ట్స్‌లో అధునాతన సదుపాయాలతో వీరికి విడిది కల్పిస్తామన్నారు. ఇందులో రూమ్స్‌ను పర్యాటకులు టూరిజం.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు, పర్యాటకశాఖ అధికారులు జి.దాసు, సిహితి, రాజేంద్ర పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి ధర్మారావు

అనంతగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని అరకు జేఎఫ్‌సీఎం కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ధర్మారావు అన్నారు. మండలంలోని కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో ఆదివారం న్యాయ విజ్ఞానం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మా ట్లాడుతూ.. బాలికల రక్షణ కోసం పోక్సోచట్టం రూపొందించినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వైకుంఠరావు, కానిస్టేబుల్ సూరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు వాలీబాల్ కిట్ పంపిణీ

అనంతగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ కేంద్రంలో ఆదివారం జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి ఆధ్వర్యంలోని యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువకులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గొందిపల్లిలో గ్రావిటీ పథకం ప్రారంభం

గూడెంకొత్తవీధి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీకేవీధి పంచాయతీ గొందిపల్లి గ్రామంలో సత్యసాయి ట్రస్ట్ నిర్మించిన గ్రావిటీ పథకాన్ని ఆదివారం ఆ ప్రతినిధులు ప్రారంభించారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తంచేశారు. ఈ గ్రామ గిరిజనులు ఏళ్ల తరబడి ఊటగెడ్డ నీటిని ఉపయోగిస్తున్నారు. ఈ నీటి కోసం పొలాల గట్టపై కిలోమీటరు దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ విషయాన్ని గుర్తించిన సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు రూ. 2 లక్షలు వెచ్చించి గ్రావిటీ పథకం నిర్మించి, కొళాయిలు ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ఆదివాసీలు గ్రామ ముఖద్వారం వద్ద ఖాళీ బిందెలతో ఆర్చ్ తరహాలో అలంకరించారు. గ్రామంతా పచ్చని తోరణాలతో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ సభ్యులు శ్రీనువాసురెడ్డి, సంతోష్, గ్రామపెద్దలు కొడబాల పెద్దబ్బాయి, బాలరాజు, వెంకటేశ్, బచ్చల పెద్బాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


గ్రామ ముఖద్వారంలో గిరిజనులు బిందెలతో అలంకరించిన ఆర్చ్


కొళాయిని ప్రారంభిస్తున్న సత్యసాయి ట్రస్ట్ సభ్యుడు

'హౌసింగ్ బిల్లులు మంజూరులో చేతివాటం తగదు'


ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ గృహాల బిల్లులు మంజూరులో హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ చేతివాటం చూపడం తగదని సీపీఎం మండల నేతలు నారాయణ, జీనబంధులు అన్నారు. మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ కాంగు వీధి, నందిమెట్ట గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ ఇళ్ల బిల్లులు మంజూరులో హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ అక్రమ వసూలకు ప్పాడుతున్నాడని, అతనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సీలేరు, మార్చి 23, ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు బాలుర గురుకుల పాఠశాలలో 2025 -26 విద్యా సంవత్సరంలో 5 వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బుజ్జిబాబు తెలిపారు. ఈ ఏ డాది పాఠశాలలో 5 వ తరగతిలో 80 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. నాలుగో తరగతి పాసైనవిద్యార్థులు అర్హులని తెలిపారు. వారు తలిదండ్రులతో పాఠశాలకు వచ్చి ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, ఫోన్ నంబర్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థి చదువుతున్న పాఠశాల వివరాలతో రావాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్: 94409 60780ను సంప్రదించాలని కోరారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం


మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రా మాల పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు మొక్కు లు తీర్చుకొనేందుకు రావడంతో ఉదయం ఆలయం రద్దీ నెలకొంది. భక్తుల పేరిట అర్చకులు సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలు, అభిషేకాలను నిర్వహించారు. మైదాన ప్రాంత భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని బంధు మి త్రులు, కుటుంబ సభ్యులతో సాయంత్రం వరకు గడిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణ, బి.వెంకటరమణ, డి.రాము, కె.రాధాకృష్ణం నాయుడు, ఎల్.రత్నాబాయ్, కె.దేముడు, జి.శంకరరావు, కె.చంద్రమోహన్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాలను మైదాన ప్రాంతం నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

అన్న సమారాధనలో పాల్గొన్న ప్రముఖులు

మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం మధ్యాహం చేపట్టిన భారీ అన్న సమారాధనను స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ ఎం.ఉదయ్ భాస్కరరావు, కుటుంబ సభ్యులతో పాటు డిప్యూటీ ఐజీ జి.బాలకృష్ణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వీరితో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ ఉదయ్ భాస్కరరావు

ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఎన్‌ఎల్‌ఎన్‌ఏటీ పరీక్షలు

» 807 పరీక్ష కేంద్రాల్లో 8,584 మంది హాజరు


పరీక్ష రాస్తున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

పాడేరురూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పండమెంటల్ లిటసీ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్టు (ఎఫ్‌ఎల్‌ఎన్‌ఏటీ) పరీక్షను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలో నిర్వహించినట్టు వయోజన విద్యశాఖ నోడల్ ఆఫీసర్ కె.గంగన్నదొర తెలిపారు. జిల్లాలోని నిరక్షరాస్యులైన 8,800 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 807 పరీక్ష కేంద్రాలలో ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. పాడేరు డివిజన్‌లో 4,400 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా 4,377 మంది పరీక్ష రాశారన్నారు. అలాగే రంపచోడవరంలో 4,400 మంది సభ్యులకు గాను 4,207 మంది హాజరయ్యారన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌ఏటీ పరీక్షలకు మండలంలో ఏపీఎంలు, జిల్లాలో ఏపీఎం ఐబీలు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి వి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి: జడ్పీటీసీ సభ్యుడు


పొలంలో గిరిజనులు సేకరిస్తున్న నీటిని పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, టోకూరు సర్పంచి మోస్య

అనంతగిరి, మార్చి 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొండిబ పంచాయతీ నడిమివలస, దుంబ్రివలస గ్రామాలను ఆదివారం జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు గిరిజనులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పొలాలకు వాడే నీటిని వినియోగించాల్సి వస్తోందని వాపోయారు.ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ.. అధికారులు స్పందించి, తాగునీటి కి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచి కిల్లో మోస్య, తదితరులు పాల్గొన్నారు.

నేడే ఐపీఎల్ సమరం

... 5వ పేజీ తరువాయి

బాక్సులు, లైటర్లు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లు, మండే స్వభావంగల వస్తువులు, పొగాకు ఉత్పత్తులు, టిఫిన్లు, పదునుగా ఉన్న వస్తువులు, తినుబండారాలు, గొడుగులు, క్రాకర్స్, జంతువులు, రేడియో, ఆల్కహాల్, కర్రలు, లేజర్‌లైట్లు, బెలూన్లు, గ్లాస్‌బాటిళ్లు, పెర్‌ఫ్యూమ్స్ స్ప్రే బాటిళ్లు, సిరంజిలు, విజిల్స్, హారన్స్, స్పోర్టింగ్ బాల్స్, రోలర్ స్కేటర్లు, ప్రమోషనల్ ప్రొడక్ట్స్, ల్యాప్‌ట్యాప్‌లు, పెన్నులు, పెన్సిళ్ల తీసుకురాకూడదు.

కొండకర్ల ఆవలో నిలువు దోపిడీ!

... 5వ పేజీ తరువాయి

తేచ్చారు. అయితే చేపల వేట సాగించే ఫైబర్ బోట్లలో పర్యాటకులను ఎక్కించుకుని ఆవలో సందర్శించే వారితోపాటు ఆవ వద్ద ఫొటో షూట్‌లకు వచ్చే వారి నుంచి, షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించే వారి నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. పర్యాటకుల నుంచి నిర్ణీత మొత్తంలో చార్జీలు వసూలు చేయాలన్న నిబంధనలు ఏవీ లేకపోవడంతో బోట్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే ఒక్క బోటులో కూడా లైఫ్ జాకెట్లు లేవు.

కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ నిధులు సుమారు రూ.60 లక్షలతో మెయిన్ రోడ్డు నుంచి కిలోమీటరు మేర సిమెంటు రోడ్డు వేయించారు. సీఎస్ఆర్ నిధులతో సోలార్ వీధి దీపాలు, టాయిలెట్లు, ఒక షెడ్డు, శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేశారు. రూ.20 లక్షలతో పిల్లల పార్కు, కార్ పార్కింగ్‌లను అభివృద్ధి చేశారు. మొత్తం మీద కోటి రూపాయలకుపైగా ఖర్చుచేశారు. కానీ పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెందడంలేదు.

జడ్పీ కోఆప్షన్ సభ్యునిపై ఎమ్మెల్యే ఫైర్

... 5వ పేజీ తరువాయి

మందలించారు. అయినాసరే నర్మాల కుమార్ మాట్లాడడం ఆపకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. "మధ్యలో మాట్లాడొద్దన్నానా! అసలు నువ్వు మాట్లాడొద్దు. ఎప్పుడు ఎలా మాట్లాడాలో నీకు తెలియదు. కామన్‌సెన్స్ లేకపోతే ఎలా? జడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేదికపై కోర్చోవచ్చని ప్రొటోకాల్‌లో వుందా? ముందు నువ్వు బయటకు వెళ్లు" అని కోపంగా అన్నారు. అయినాసరే నర్మాల కుమార్ ఇంకా ఏదో చెప్పబోతుండగా... ఇలాగైతే తానే బయటకు వెళ్లిపోతానంటూ ఎమ్మెల్యే విజయకుమార్ కుర్చీలో నుంచి లేచారు. దీంతో వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి.. జడ్పీ కోఆప్షన్ సభ్యుడిని మందలించారు. ఇటువంటి తరుణంలో నర్మాల కుమార్ ఏదో అనబోతుండగా.. 'ససగవద్దు. ముందు బయటకు వెళ్లు' అని ఎమ్మెల్యే హెచ్చరించారు. మీరు కాదు అధికారులు చెప్పాలని కుమార్ అంటుండగా.. వారు చెప్పరు తానే చెబుతున్నానని, ముందు బయటకు వెళ్లు అని గద్దించడంతో కుమార్ సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు.



రోడ్డు సర్వేకు గౌరీపట్నం నుంచి వాహనాలపై వెళ్తున్న ఎమ్మెల్యే రాజు

రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే సర్వే

చోడవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నం ఎలిసెట్టి కళ్లాల మీదుగా బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిని కలుపుతూ రహదారి నిర్మాణంపై ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం సర్వే చేశారు. కూటమి నాయకులతో కలిసి ద్విచక్ర వాహనాలపై ఆయన సర్వే నిర్వహించారు. రైతులు, స్థానిక ప్రజల కోరిక మేరకు మట్టి రోడ్డను పరిశీలించిన ఎమ్మెల్యే, ఈ రూటులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా స్థానికులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ, జనసేన నాయకులు సకురు కోటేశ్వరరావు, సిరిపురపు రమేశ్, గౌరీపట్నం, నరసయ్యపేట, గాంధీగ్రామం నేతలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



గోవాడ గ్రామంలో పాడైన బోర్లు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

చోడవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన క్రాష్ ప్రోగ్రాం జోరుగా సాగుతున్నది. ఏటా వేసవిలో స్థానికులు నిలదీస్తే తప్ప గతంలో బోర్ల మరమ్మతులు చేపట్టే పరిస్థితి ఉండేది కాదు. ఈ ఏడాది రక్షిత నీటి పథకాలతో పాటు బోర్ల మరమ్మతుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించడంతో పనులు ఊపందకున్నాయి. బోర్ల మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచడంతో గ్రామాలలో పనిచేయని బోర్లను వినియోగంలోనికి తీసుకు వస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు పర్యవేక్షిస్తున్నారు. బోరు మెకానిక్‌లు నాగేశ్వరరావు, గంగరాజు తదితరులు పనుల్లో నిమగ్నమయ్యారు. పంచాయతీల్లో పనిచేయని బోర్లు గుర్తింపు, వెంటనే మరమ్మతుల ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో నీటి ఎద్దడికి అవకాశం ఉండదని ప్రజా ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

84 మందికి ఆరోగ్య పరీక్షలు



రోగులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 84 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఎస్.కోటలోని మల్టీ స్పెషాలటీ ఆసుపత్రికి చెందిన స్త్రీ వైద్య నిపుణులు పి.వరలక్ష్మి సేవలు అందించారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం కొంత మందిని గుర్తించి, ఎటువంటి వైద్యం చేయించుకోవాలో సూచించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి గణేశ్ బృందం సహాయ సహకారాలు అందించారు.

కొత్తకోటలో వంద మందికి నేత్ర తనిఖీలు

రావికమతం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట ఆర్య వైశ్యులు, వాసవీ వనిత క్లబ్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో వంద మందికి నేత్ర తనిఖీలు చేశారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు రోగులకు సేవలందించారు. 55 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలిస్తున్నామని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తెలిపారు. వీరందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని చెప్పారు.

బీకే కొత్తూరులో ఎడ్లబండ్ల పరుగు పోటీలు



పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్ల బండ్లు

దేవరాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.కింతాడ కొత్తూరులో అమ్మవారి తీర్థం సందర్భంగా ఆదివారం ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరవాడ నాయుడు ఎడ్ల జతకు ప్రథమ స్థానం, మజ్జి రాజేశ్ (చుక్కపల్లి) ద్వితీయ, నేమాల నరేశ్ (లక్కవరం)లకు తృతీయ స్థానాలు లభించాయి. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వీరన్న చౌదరి, సభ్యులు బి.బాబూరావు, బి.రాము, కె.సత్యం, సూరినాయుడు పాల్గొన్నారు.

ట్రాలర్ ఢీకొని ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాలర్.. చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

మాడుగుల రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ట్రాలర్ డ్రైవర్ వేగంగా నడుపుతూ ద్విచక్ర వాహనదారులపైకి దూసుకుపోవడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదం మండలంలోని గాదిరాయి గ్రామం వద్ద ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లే మార్గంలో గ్రానైట్ తీసుకెళ్లేందుకు వినియోగించే ఖాళీ ట్రాలర్‌ను మద్యం మత్తులో డ్రైవర్ వేగంగా నడుపుతున్నాడు. గాదిరాయి మలుపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి, అదే సమయంలో ఎదురుగా కింతలి వైపు నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు వస్తున్న ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లాడు. దీంతో చీడికాడ మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన కాకర కొండబాబు, కాకర కొండమ్మ, పల్లవితో పాటు మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న మాడుగుల మండలం గొటివాడ అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా అప్పారావు, ఎర్రినాయుడు వాహనాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పల్లవి, కొండబాబు, కొండమ్మ, అప్పారావు, ఎర్రినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి 108లో తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాలర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. డ్రైవర్ మద్యం తాగి ట్రాలర్ నడపడంతోనే ప్రమాదం జరిగినట్టు గుర్తించారు.

పీఎస్ పేట రోడ్డులో కష్టాలకు తెర

రూ.1.2 కోట్లతో రహదారి నిర్మాణం

- గతుకుల మార్గం నుంచి సర్వాంగ సుందరంగా..
- చివరి దశకు చేరిన పనులు.. త్వరలోనే అందుబాటులోకి..
- మూడు మండలాల ప్రజల రవాణా సమస్యకు చెక్

చోడవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అత్యంత దుర్భరంగా తయారైన నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన గ్రామాలను కలిపే చోడవరం-పీఎస్ పేట రహదారికి ఎట్టకేలకు మహర్దశ లభిస్తున్నది. ఏళ్ల తరబడి నిర్వహణకు నోచుకోక, పూర్తిగా గుంతలమయంగా మారిపోయిన పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట వరకూ గల రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. దీంతో మూడు మండలాల ప్రజలకు త్వరలో రవాణా కష్టాలు తీరనున్నాయి.

కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట వరకూ గల రహదారి పదిహేనేళ్లుగా నిర్వహణ కొరవడడంతో శిథిలావస్థకు చేరింది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లోని పలు పంచాయతీలకు ఇది చోడవరాన్ని కలిపే రహదారి కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి ఈ రహదారిపై ప్రయాణం నరక ప్రాయంగా మారడంతో పలుమార్లు ఆటోవాలాలు, వాహనదారులు ఈ రహదారి బాగు చేయాలంటూ ఆందోళనలు కూడా నిర్వహించారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.2.83 కోట్లు మంజూరు చేసినప్పటికీ, ఈ రహదారి అభివృద్ధి పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట మీదుగా జన్నవరం జంక్షన్ వరకూ రహదారి అభివృద్ధిపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా పీఎస్ పేట వద్ద ఇప్పటికే సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. తాజాగా కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్ పేట సమీపం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు పనులు కోటి 20 లక్షల రూపాయలతో ప్రారంభించారు.



కొత్తూరు జంక్షన్‌లో అధ్వానంగా ఉన్న పీఎస్ పేట రహదారి (ఫైల్)



చురుగ్గా సాగుతున్న పీఎస్ పేట రహదారి నిర్మాణం

ఈ రూటులో వాహనాల రాకపోకలు నిలిపివేసి, సీసీ రోడ్డు పనులు పూర్తి చేస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్వయంగా పర్యవేక్షిస్తుండడం విశేషం. పీఎస్ పేట మీదుగా వెళ్లే వాహనాలను అంకుపాలెం మీదుగా మళ్లించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా సిమెంట్ కాల్వల నిర్మాణం పూర్తి చేసిన అధికారులు, ప్రస్తుతం సీసీ రోడ్డు పనులను పూర్తి చేస్తున్నారు. చిన్న చినుకుపడినా చెరువును తలపించే పీఎస్ పేట రోడ్డులో ఎంత భారీ వర్షం పడినా, నిరాటంకంగా వెళ్లేలా నిర్మాణం పూర్తి చేస్తున్నారు. 15 ఏళ్లుగా పీఎస్ పేట రహదారిలో కష్టాలు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు, ఇతర పంచాయతీ వాసులకు వాహనదారులకు త్వరలోనే ఊరట లభించనున్నది.

26న మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో రిషి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని కరస్పాండెంట్ కె.సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో, డక్కన్, అరబిందో, గ్రీన్‌టెక్, పేటీఎం, మెడ్‌ప్లస్, ముత్తూత్ గ్రూప్, స్మైలాక్స్ క్రెడిట్ యాక్సెజ్, అపోలో ఫార్మా, ఫోక్స్‌కాన్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీలు జాబ్‌మేళాలో హాజరవుతున్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు మెగాజాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

కృష్ణాదేవిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడు వద్ద ఎనిమిది మద్యం క్వాటర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వై.తారకేశ్వరావు తెలిపారు. కృష్ణాదేవిపేట నుంచి ఆదివారం మద్యం అక్రమ రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారంతో దాడి చేయగా, అతని వద్ద ఎనిమిది సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు. అప్పలనాయుడుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో సారా విక్రయాలు, బెల్టుషాపులు నిర్వహిస్తే 9440904240 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

4న వీరబ్రహ్మం విగ్రహ ప్రతిష్ఠ

నాతవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవనది సమీపంలో ఉన్న చిక్కుడుపాలెం శివశక్తి భూగర్భ శివాలయం ఆలయ ప్రాంగణంలో వచ్చే నెల 4వ తేదీన మహా మృత్యుంజయ శివలింగం, కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త కె.సీతారామశర్మ తెలిపారు. అదే రోజు కపిలగోవు, గోమయ, శివలింగం, ఇనుము శివలింగం కూడా ప్రతిష్ఠంచనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మృత్యుంజయ, రుద్రా హోమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వహస్తాలతో వివిధ దోషాలు, సమస్యలు తొలగిపోవడానికి శివలింగాన్ని తాకుతూ పూజలు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో మరుపాక విద్యార్థిని ప్రతిభ



కీర్తన

రావికమతం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ ఫలితాల్లో మురుపాక ఏపీ మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని కాశెట్టి కీర్తన రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఫిబ్రవరి 24న నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ జరిగింది. ఈ పోటీ పరీక్షలో కీర్తన పాల్గొని రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు సాధించినట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యసునీల్ తెలిపారు. జూన్‌లో ప్రతిభా పురస్కారాల అందజేస్తారని ఆయన చెప్పారు.

డ్వాక్రా సభ్యులకు ఉల్లాస్ పరీక్ష

బుచ్చెయ్యపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సభ్యులకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 510 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, 493 మంది వచ్చారు. మండల వ్యాప్తంగా 40 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్టు వెలుగు ఏపీఎం రాజబాబు తెలిపారు. వెలుగు సిబ్బంది, వీవోఏలు, సీసీలు పరీక్షలను పర్యవేక్షించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

బుచ్చెయ్యపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు ఆదివారం కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. కేపీ అగ్రహారం, ఐతంపూడి, దిబ్బిడి, గున్నెంపూడి, పి.భీమవరం, చినఅప్పన్నపాలెం, పెదమదిన కార్యకర్తలకు ఈ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు, నాయకులు డి.అప్పలనాయుడు, సీత నాగరాజు, జి.శ్రీనివాసరావు, సుంకర బాబ్జి, ద్వారపురెడ్డి శంకర్రావు, అడ్డూరి శ్రీను, నాయుడు, ముచ్చకర్ల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సిమెంట్ రోడ్ల నిర్మాణం

గొలుగొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగనన్న కాలనీలకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని చీడిగుమ్మల, గుండుపాల గ్రామాల్లో సిమెంట్ రోడ్డు పనులు సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో రోడ్డు పనులు సాగుతున్నాయి. మట్టి రోడ్లు సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చెందడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బ్లాస్టింగ్‌లతో ప్రజలు భయాందోళన

రోలుగుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు గ్రామ శివారున ఏర్పాటు చేసిన నల్లరాయి క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్‌వెల్ రిగ్గులతో బ్లాస్టింగ్‌లు చేస్తున్న క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కొవ్వూరు గ్రామానికి చెందిన ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు. భారీ ఎత్తున బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తుండడంతో పెద్ద పెద్ద శబ్దాలకు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఎటువంటి భద్రతా ప్రమాణాలను పాటించడం లేదన్నారు. దీనిపై అధికారుల చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న అప్పలనాయుడు

కె.కోటపాడు/చీడికాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు స్పష్టం చేశారు. మండలంలోని కింతాడ శివారు బత్తివానిపాలెం గ్రామంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ముగ్గురు బాధితులకు పంపిణీ చేశారు. గుల్లేపల్లి గ్రామానికి చెందిన రొంగలి నాగమణికి రూ.57 లక్షలు, చీడికాడ మండలంలోని తురువోలు గ్రామానికి చెందిన ముర్రు వెంకన్ననాయుడుకు రూ.56,269, సింగవరం గ్రామానికి చెందిన భూపతి భాస్కర్ వెంకటేశ్వర్లుకు రూ.2 లక్షల చెక్కులను కార్యకర్తల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కె.కోటపాడు, చీడికాడ మండలాల అధ్యక్షులు రొంగలి మహేశ్, పోతల చిన్నంనాయుడు, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, బండారు నరసింహనాయుడు, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, బండారు ప్రసాద్, శంకరరావు, ఇంజరపు బ్రహ్మజీ, కె.గంగరాజు, శరగడం శివ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలో మోస్తరు వర్షం



కృష్ణాదేవిపేటలో పడుతున్న వర్షం

గొలుగొండ/కృష్ణాదేవిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, జోగంపేట, పాకలపాడు, గుండుపాల, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, పప్పుశెట్టిపాలెం, గొలుగొండ తదితర గ్రామాల్లో మధ్యాహ్నం వాన పడింది. గత వారం రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం పడడంతో చల్లబడ్డారు.

కుక్క కాటుతో చిన్నారులకు గాయాలు



కుక్కకాటు గాయాలతో ఉన్న చిన్నారులు

మాడుగుల రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం గ్రామంలో ఆదివారం కుక్కకాటుతో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన ఎల్లపు రాము కుమారుడు, కుమార్తె జ్ఞానేశ్వర్, ప్రణీత తినుబండారాలు కొనుక్కునేందుకు వెళుతుండగా, వీరిపై కుక్క దాడి చేసింది. దీంతో చిన్నారుల ముఖం, చేతులపై గాయాలయ్యాయి. వీరిని పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, దీనిపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బాధితులతో పాటు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

ఐదు శాతం రిజర్వేషన్ కోసం పోరాడతాం

- రెల్లి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి అప్పన్నబాబు

కృష్ణాదేవిపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాడతామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి అప్పన్నబాబు స్పష్టం చేశారు. కృష్ణాదేవిపేటలో ఆదివారం రెల్లి కులస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు ఒక్క శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం అన్యాయమని వాపోయారు. ఈ కార్యక్రమంలో రెల్లి సంఘం నాయకులు యల్లపు లోవరాజు, బంగారు శ్రీను, ముత్యాలు చిన్నబ్బాయి. యర్రంశెట్టి కుమార్‌బాబు, దుర్గాప్రసాద్, రత్నరాజు, శివ, కోనా ప్రసాద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా విశ్వాసం కోల్పోయిన ఎన్డీఏ ప్రభుత్వం'

దేవరాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ విమర్శించారు. మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేమల కన్నబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఎన్డీఏ ప్రభుత్వం పెడుతున్నదన్నారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పరాజు, వియ్యపురాజు, కన్నబాబు, కాసుబాబు పాల్గొన్నారు.

జీడి తోటలకు నష్టపరిహారం అందించాలి

బుచ్చెయ్యపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీపీ.అగ్రహారంలో జీడిమామిడి తోటల రైతులకు నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీ.నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.సాంబశివరావు డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి పూర్తిగా కాలిబూడిదైందని, రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కురచా శంకర్రావు, అనిమిరెడ్డి కొండబాబు, గొరపల్లి వెంకయ్యమ్మ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో తాగునీటి బోరు ప్రారంభం

చీడికాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలకలవారి కళ్లాల వద్ద జడ్పీటీసీ సభ్యురాలు శారదవరలక్ష్మి నిధులతో ఆదివారం తాగునీటి బోరును నిర్మించారు. గ్రామానికి చెందిన పి.మహేశ్, పి.అప్పారావు, సిమెంట్ నాయుడు, ఎస్.మహేశ్ బోరును ప్రారంభించారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని చూపించాలి

చోడవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనలో యువతకు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ఆదర్శం కావాలని ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక గోవాడ ఎస్టీ హాస్టల్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ సారథ్యంలో రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాటాలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎస్.రాజు, తిమోతి, సందీప్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని ఖండివరం, అప్పలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసర్, పాల సంఘం-2 అధ్యక్షుడు సుంకర లగ్గన్న, నాయకులు గెంజి కృష్ణ, గణేశ్, నాగేశ్వరరావు, వినాయక్‌కుమార్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనం

రోలుగుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనమవుతున్నాయని ఎస్ఐ రామకృష్ణారావు స్పష్టం చేశారు. స్టేషన్‌లో ఆదివారం విలేకరులనాయన మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లు సాఫీగా సాగుతున్న జీవితాలను నాశనం చేస్తాయన్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగ్‌లు ఆసక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో డబ్బులను బెట్టింగులకు పెట్టి, చివరకు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈ తరహా బెట్టింగ్ యాప్‌లను వినియోగించడం, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడడం చట్ట విరుద్ధమన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారాన్ని డయల్ 100 లేదా 112కు అందించాలని ఆయన కోరారు.

చినపాచిలలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

రావికమతం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చినపాచిల గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తున్నామని సర్పంచ్ కోమటి శంకరావు, ఎంపీటీసీ సభ్యురాలు ముచ్చకర్ల భవానీ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులు సుమారు రూ.3 లక్షలతో మూడు తాగునీటి బోర్ల నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఎమ్మెల్యే రాజు సహకారంతో ఈ బోర్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోమటి శంకరావు, పాల సంఘం అధ్యక్షుడు ఆదాడ రాజారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోన పరిదేశినాయుడు, టీడీపీ సీనియర్ నేత ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతర కరపత్రాల విడుదల

కె.కోటపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూకాంబిక అమ్మవారి జాతర కరపత్రాలను మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొత్త అమావాస్య పండుగను వైభవంగా జరుపుతున్నట్టు చెప్పారు. కోటి వత్తుల దీపారాధన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవ కమిటీ సభ్యులు వి.త్రినాథ్, ఎం.నానాజీ, ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

మరికొన్ని జోన్ వార్తలు II లో..

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో భక్తుల రద్దీ

అనకాపల్లి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే భక్తుల తాకిడి ప్రారంభమైంది. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలావుంటే, పిళ్లా వారి వీధివాసులు అమ్మవారి పండుగను జరిపారు. పెద్ద ఎత్తున మహిళలు ఘటాలతో పురవీధుల గుండా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, టీడీపీ 84వ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, అప్పారావు, తారకేసు, ఆనందరావు, రవికుమార్ పాల్గొన్నారు.

రైల్వే లోకో పైలట్‌కు సత్కారం



వరహాలబాబు దంపతులతో మాధవ్

ఇదిలావుంటే, గవరపాలెం నూకాంబిక అమ్మ వారి ఆలయ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రైల్వే లోకో పైలట్ ఎస్.వరహాలబాబు దంపతులను మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ సీనియర్ నేత మాధవ్ సత్కరించారు. గత సోమవారం తెల్లవారుజామున విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గూడ్స్ రైలు ప్రమా దం బారిన పడకుండా అతి చాకచక్యంగా రైలును వరహాలబాబు నిలిపివేశారు. అనకాపల్లి మండలం సీతానగరానికి చెందిన ఈయన నూకాంబిక దర్శనానికి రావడంతో అదే సమయంలో మాధవ్ కూడా ఆలయానికి విచ్చేశారు. అనంతరం వరహాలబాబు దంపతులను సత్కరించారు. గంగుపాం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్టీ కాలనీ సమీపంలో ఆదివారం ఓ మహిళ నుంచి హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు పది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ రామాపురానికి చెందిన ఎం.దేవుడమ్మ మద్యం దుకాణంలో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా, బీఆర్టీకాలనీ సమీపాన అనుమానం వచ్చి హెడ్ కానిస్టేబుల్ తనిఖీ చేసి పట్టుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

'గోవాడ షుగర్స్ ఆధునికీకరణ హామీ నిలబెట్టుకోవాలి'

అనకాపల్లి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గోవాడ చక్కెర కర్మాగారాన్ని ఆధునీకరిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని వారు నిలుపుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అనకాపల్లి జిల్లాలో నడుస్తున్న ఏకైక గోవాడ చక్కెర కర్మాగారాన్ని మూసివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు చోడవరం ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేయడం అన్యాయమన్నారు.

వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిట్టిబాబు

పాయకరావుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పుట్టిన రోజు వేడుకలు పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని బాలుర వసతి గృహాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర తదితరులు 200 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, దేవవరపు రాజబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, గంపల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవ-పెదపాడు కాలువలో పూడికతీత



తిమ్మరాజుపేట వద్ద కాలువలో పూడిక తీస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల ఆవ నుంచి పెదపాడుకు వెళ్లే సాగునీటి కాలువలో పూడికను ఆదివారం తీయించారు. మూడు కిలోమీటర్లు మెషిన్ల సాయంతో పూడిక తీయించారు. గత ప్రభుత్వ హయాంలో పూడిక తీయకపోవడంతో పొలాలకు నీరు అందలేదని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో పూడిక తీయించడం జరిగిందన్నారు.

'ఐక్యంగా హక్కులను కాపాడుకుందాం'

మునగపాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాలల ఉప కులాలపై రాజకీయ కుట్ర జరుగుతోందని, ఐక్యంగా హక్కులను కాపాడుకుందామని అంబేడ్కరిజం పునాది వ్యవస్థాపకుడు రాజాన బుజ్జిబాబు తెలిపారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. రాజకీయ ఉచ్చులో పడవద్దని చెప్పారు. సమావేశంలో గుంటల అప్పారావు, బీలా శివగణేష్, కారు శాంత్‌కుమార్ పాల్గొన్నారు.

'అచ్యుతాపురానికి రింగ్ రోడ్ నిర్మించాలి'

అచ్యుతాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో ఫ్లైఓవర్‌కి బదులు రింగ్ రోడ్ నిర్మించాలని భవన యజమానుల సంఘం కోరింది. ఆదివారం అచ్యుతాపురంలో భవన యజమానులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అచ్యుతాపుం నుంచి సెజ్ రోడ్డు విస్తరణలో తాము స్థలాలను కోల్పోయామని, మిగిలిన చిన్నపాటి స్థలాల్లో చిన్న గృహాలు కట్టుకొని నివసిస్తున్నామన్నారు. ఇవి కూడా పోతే తాము తల దాచుకోవడానికి నీడ కూడా ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో రాజాన సన్యాసినాయుడు, పల్లి శేషగిరిరావు, శరగడం శ్రీధర్, పంచదార్ల రవి, నీరుకొండ సూర్యచంద్ర, జి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

65 మంది రోగులకు కంటి పరీక్షలు

ఎస్.రాయవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండలంలోని ధర్మవరం అగ్రహారంలో అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 65 మంది రోగులకు పరీక్షలు జరిపారు. పాయకరావుపేట హైమ నేత్రాలయం వైద్యులు రోగులకు పరీక్షలు జరిపి 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరందరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఛైర్మన్ అచ్యుత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హైమ నేత్రాలయం పీఆర్వో రవికుమార్, టీడీపీ నేత బండి నాగేశ్వరరావు, జనసేన నేత లింగంపల్లి జ్యోతికుమార్, వెలగా వినయ్, దేవోజీ నాని తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ పండగ గోడపత్రిక ఆవిష్కరణ

మునగపాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరదేశమ్మ అమ్మవారి పండగ గోడ పత్రికను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఈనెల 25వ తేదీన జరగనున్న అమ్మవారి పండుగకు రావాలని ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వేగి కృష్ణ, సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రాజయ్యపేట

నక్కపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి అనిత బర్త్ డే సందర్భంగా స్థానిక హెటెరో మైదానంలో 12 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా రాజయ్యపేట నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో రాజయ్యపేట నూకతాత టీం, పాయకరావుపేట క్రికెట్ లవర్స్ జట్లు తలపడ్డాయి. ఈ పోటీని హోం మంత్రి అనిత ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీలో రాజయ్యపేట నూకతాత జట్టు విన్నర్‌గా నిలవగా, పాయకరావుపేట క్రికెట్ లవర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. 1లక్షలు, విన్నర్ జట్టుకు రూ. 50వేలు సోమవారం హోం మంత్రి అనిత అందించనున్నారు. ఫైనల్ మ్యాచ్‌ను హోం మంత్రి సహా నియోజకవర్గం కూటమి నాయకులు తిలకించారు.



ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

నేడు హోంమంత్రి అనిత బర్త్ డే

▸▸ జన్మదిన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

నక్కపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బర్త్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. హోం మంత్రిగా తొలి బర్త్‌డే జరుపుకోవడంతో నాలుగు మండలాల నాయకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం ధర్మవరం వరకూ వున్న హైవేపై హోం మంత్రి అనితకు బర్త్ డే విషెస్ చెబుతూ కూటమి నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నక్కపల్లి సమీపంలో వున్న హోం మంత్రి అనిత నివాసం వద్ద సోమవారం జన్మదిన వేడుకలను నిర్వహిస్తారు. హోం మంత్రి అనితను కలవడానికి నియోజకవర్గ నాయకులు, అధికారులతోపాటు, ఇతర జిల్లాలకు చెందిన నాయకులు, అధికారులు కూడా రానున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : అనిత

20 మందికి రూ.24.45 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పాయకరావుపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం నక్కపల్లి సమీపంలోని మంత్రి నివాసంలో 20 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.25,45,270ల సాయాన్ని చెక్కుల రూపంలో మంత్రి అనిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందించిన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న హోం మంత్రి వి.అనిత

అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా పనిచేద్దాం

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు శంకుస్థాపనకు అందరూ రావాలి

బార్క్, నేవల్ బేస్ పనులు కచ్చితంగా జరగాలి

మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అభివృద్ధి కోసం అందరం పనిచేద్దామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు ఈనెల 31వ తేదీన మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేస్తారన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులంతా ఈ కార్యక్రమానికి రావాలన్నారు. కేవలం నిర్వాసితులకే రూ.200 కోట్లు పరిహారం ఇవ్వాలని, అంత డబ్బులు ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పరిస్థితిలో లేనందున నిర్వాసితులను ఒప్పించి టీడీఆర్ పద్ధతిలో రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్నామన్నారు. తెలంగాణాకు హైదరాబాద్ ఎటువంటిదో ఏపీకి అచ్యుతాపురం అటువంటిదన్నారు. అచ్యుతాపురం సెజ్ ద్వారా రూ.16 వేలు నుంచి 17 వేల కోట్లు పన్నుల రూపంలో వస్తోందని, ఇక్కడ నుంచి రోడ్లు హైవేకి కనెక్టివిటీ చేస్తే ఈ ఆదాయం 30 వేల కోట్లకు పెరుగుతుందన్నారు. త్వరలో పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాయకుల సిఫార్సులు తీసుకొనే పరిస్థితి వచ్చేలా మంత్రి నారా లోకేశ్ పథకాలు రూపొందించారన్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతానికి అంతర్జాతీయ పాఠశాలతోపాటు జాతీయ విశ్వవిద్యాలయం కూడా వస్తోందన్నారు. అచ్యుతాపురం మండలంలో బార్క్, రాంబిల్లి మండలంలో నేవల్ బేస్ పనులు కచ్చితంగా జరగాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరు ఆటంకాలు కల్పించినా సహించేది లేదన్నారు. ప్రతిపక్ష సర్పంచ్‌లున్నచోట కార్యదర్శులు సహకరించడంలేదని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గత ప్రభుత్వంనుంచి అలవాటైపోయిందని, సర్పంచ్‌కు విలువ ఇవ్వకపోతే రాజ్యాంగానికి విలువ ఇవ్వనట్టేనని అన్నారు. తనకు మూడేళ్ల నుంచి నిధులు ఇవ్వడం లేదని దిబ్బపాలెం ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విజయకుమార్ దిబ్బపాలెం పంచాయతీకి మూడు సంవత్సరాల నిధులను ఈ ఏడాది మంజూరు చేయాలని ఎంపీడీవోతోపాలు ఇతర అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎంపీడీఓ కె. ప్రభాకర రావు, ఏపీఐఐసీ జెడ్ఎం దుర్గాప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

ఎలమంచిలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని డీవైఎఫ్ఐ నేతలు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, గ్రంథాలయాధికారి ఆనంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పార్థు, వాసు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధి జె.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో...

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు అన్నారు. ఆదివారం మండలంలోని మోసయ్యపేటలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు బి.రాంకుమార్, సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, సీఎం నాయుడు, గొర్లె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మోసయ్యపేటలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెంకట అప్పారావు



ఎలమంచిలిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

రాంబిల్లిలో..

మండల కేంద్రంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు సీహెచ్ రామకృష్ణ, ధోని, కాశియ్య, వై.రాము, రాజేశ్వరి, గాయత్రి, లక్ష్మీనారాయణ గంగరాజు, పవన్‌కుమార్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో కాపాడేదే రక్తదానమని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సినీ హీరో రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రశాంతి విద్యా సంస్థల ఆవరణలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రమాదాల్లో చాలా మంది సమయానికి రక్తం లేక చనిపోతున్నారన్నారు. ఇటువంటి రక్తదానాలు వారి ప్రాణాలను కాపాడుతాయన్నారు. ఈ సందర్భంగా 136 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రశాంతి విద్యా సంస్థల ఛైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, అఖిల భారత రామ్‌చరణ్ యువత అధ్యక్షుడు లాలం చందు, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, పవన్ విజయ్, కూండ్రపు రమణ, దేశంశెట్టి ఎల్లయ్య నాయుడు పాల్గొన్నారు.

'శతశాతం అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం'

రాంబిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : శతశాతం అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ పథకం లక్ష్యమని వెలుగు మండల ఏపీఎం పద్మ అన్నారు. ఆదివారం మండలంలోని 30 పంచాయతీల పరిధిలోని 49 సెంటర్ల నిరక్షరాస్యులైన మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 495 మందిని నిరక్షరాస్యులను ఉల్లాస్ పథకానికి ఎంపిక చేసి, మూడు నెలలుగా విద్యనందించామన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభం

అచ్యుతాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెంలో రుద్రభూమికి వెళ్లే రహదారి, రామన్నపాలెంలో డ్రైనేజీల పనులను ఆదివారం చోడపల్లి ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధర్మిరెడ్డి సన్యాసినాయుడు, నాయుడుబాబు, డీవీఎస్ నాయుడు, కోట్లు రామ్మూర్తి, సత్యం పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

కోటవురట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం శివారు సన్యాసిరాజుపాలెంలో ఈనెల 14వ తేదీన సింగంపల్లి వరలక్ష్మి ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని ఆదివారం పట్టుకున్నట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాలుడు ఈ దొంగతనానికి పాల్పడినట్టు ఆయన తెలిపారు. బాలుడు దొంగిలించిన రూ2.2లక్షలు నగదుతోపాటు అర తులం బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్టు తెలిపారు.

27న బాపిరాజు కొత్తపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక

కోటవురట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపిరాజు కొత్తపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. ఇప్పటికే సర్పంచ్, వార్డుమెంబర్లకు నోటీసులు అందజేసినట్టు తెలిపారు. ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 27వ తేదీన ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఎన్నికకు సర్పంచ్, వార్డు సభ్యులు హాజరుకావాలని కోరారు.

కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు గడువు పెంపు

కోటవురట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లు వ్యక్తిగత రుణాలు మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ఈనెల 25వ తేదీన వరకు పొడగించినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల రుణాలు మంజూరు కోసం ఆసక్తి చూపుతున్నారన్నారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాంకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాంబిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. ప్రమీల ఆదివారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, 9వ తరగతిలో 1 సీటు, 11వ తరగతిలో 40 సీట్లు, 12వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని, బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైయిందని, ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని ప్రిన్సిపాల్ ప్రమీల తెలిపారు.

సత్యసాయి మందిర బాల వికాస్ గురువులకు శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి

కొత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని గాంధీనగరంలో గల సత్యసాయి మందిరంలో జిల్లా బాల వికాస్ గురువులకు ఆదివారం శిక్షణ నిర్వహించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అనకాపల్లి, మునగపాక, కశింకోట, అచ్యుతాపురం మండలాలకు చెందిన సత్యసాయి బాల వికాస గురువులకు ఈ తరగతులను ఏర్పాటు చేశామన్నారు. వీరి ద్వారా పిల్లలకు సనాతన ధర్మం, రామాయణం, భారతం, సంస్కృతీ సంప్రదాయాలు వంటి పలు అంశాలపై పాటలు, కథ లతో పాటు వివిధ రూపాల ద్వారా అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి విద్యా విభాగం జిల్లా సమన్వయకర్తలు శంకర్, శక్తిమూర్తి, జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ భారతి, ఆధ్యాత్మిక సమన్వయకర్త కామరాజు, జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ అప్పారావు, ఫ్యాకల్టీ కృష్ణకుమారి, జిల్లా విద్యా విభాగం మహిళా సమన్వయకర్త వెంకటలక్ష్మి, గణేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఆవఖండంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి'

తుమ్మపాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆవఖండంలో జరుగుతున్న అక్రమాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎగువన కురిసిన వర్షపునీరు చేరుకునే ఆవఖండంలో కొంతమంది అక్రమార్కులు భారీగా గ్రావెల్ ఫిల్లింగ్ చేస్తూ కప్పేస్తున్నారన్నారు. టౌన్‌షిప్‌ల ఏర్పాటు పేరుతో రియల్ ఎస్టేట్ దందాకు పలువురు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కనిశెట్టి సురేష్, కొణతాల హరినాథబాబు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

23వ రోజుకు ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 23వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వన్ మ్యాన్ సర్వీస్‌ను అల్ట్రా డీలక్స్ సర్వీస్‌కు వరకు మాత్రమే పంపాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని నినాదాలు చేశారు.

కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం

▸▸ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు

పరవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామరాజు స్పష్టం చేశారు. మండలంలో తానాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూస్తామన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ఢోకా లేకుండా కృషి చేస్తామన్నారు. కార్మిక సమస్యలపై భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయనను యూనియన్ నాయకులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. టీఎన్‌టీయూసీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, లెనిన్ బాబు, సూర్యనారాయణ, నరేంద్రకుమార్, గొర్లిశ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రఘురామరాజుకు జ్ఞాపికఅందజేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

'భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి'



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు

తుమ్మపాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి గుండాల జంక్షన్‌లోని బీసీ బాలికల వసతిగృహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శనను నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం రాజీలేని పోరా టం చేసిన మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లుగా పేర్కొన్నారు. నేటి యువత వీరి ఆశయాలకు అనుగుణంగా పనిచేయా లని పిలుపునిచ్చారు. దేశంలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తూ యువత శ్రమను కార్పొరేట్ రంగాలకు తాకట్టు పెడుతున్న ప్రభుత్వాల నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఫణీంద్ర, సింహాద్రి, బిందు తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ: స్వాతంత్ర్య సంగ్రామంలో అలుపెరుగని పోరాటం చేసిన భగత్‌సింగ్ వర్ధంతిని ఇక్కడి బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీవో



'ఉల్లాస్'లో భాగంగా శిక్షణ పొందిన మహిళలు పరీక్ష రాస్తున్న దృశ్యం

సబ్బవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉల్లాస్ నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.పద్మజ కోరారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు 467 మంది సభ్యులు హాజరయ్యారు. ఫలితాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, వెలుగు ఏపీఎం సీహెచ్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సిబ్బంది, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న దుర్గమాంబ

పరవాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇ.బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెంలో దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, మాజీ సర్పంచులు అట్టా సన్యాసిఅప్పారావు, బొద్దపు నూకరత్నం, కూటమి నాయకులు మేడిశెట్టి బాలాజీనాయుడు, బుగిడి రామగోవిందరావు, మేడిశెట్టి వెంకటరావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుడు శ్యామ్‌కుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్యామ్‌కుమార్

కొత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి గాంధీనగరానికి చెందిన పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుడు తమ్మిరాజు శ్యామ్‌కుమార్‌కు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సేవా సంస్థ తెలుగు బుక్ ఆఫ్ అవార్డును ఆదివారం ప్రదానం చేసింది. జ్యోతిష్యంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసింది.